




భవన నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఎం హరి నారాయణన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతిపై పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ లు మొదలైన ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాల న్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్

అడిగేదెవ్వరు..ఆపేదెవ్వరూ.!

నెల్లూరు నగరంలో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణ చేసిన నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారపార్టీ నేతల అండదండలతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్నారు. అడిగేదెవ్వరూ, ఆపేదెవ్వరూ అన్నట్లు ముందుకు పోతున్నారు. అధికారపార్టీలోనే నేతల మధ్య అక్రమ లేవుట్లపై ప్రచ్ఛన్న యుద్ధం సాగుతోంది. అక్రమ లేవుట్ల విషయం ఓవైపు ఉంటే, ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ప్లాట్స్ తయారు చేస్తున్నారు. అల్లీపురం గ్రామంలో ఇరిగేషన్‌కు చెందిన 6.30 ఎకరాలు ఆక్రమించి, ప్లాట్స్‌గా మార్చేసిన విషయం తెలిసిందే. అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు చర్యలు తీసుకోవాలని, నిర్మాణాలు ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిని అమలు చేయాల్సిన ఇరిగేషన్ అధికారులు సిబ్బంది లేరంటూ తప్పించుకుంటున్నారు. హైకోర్టు, కలెక్టర్ ఉత్తర్వులు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై జెసి కూర్మానాథ్ మళ్లీ నివేదిక తయారుచేసినట్లు తెలిసింది. కలెక్టర్‌కు నివేదిక చేరనుంది. తరువాత ఏం జరుగుతుందో చూడాలి.

- ○అల్లీపురంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- ○ఇరిగేషన్ అధికారులు మొద్దు నిద్ర
- ○ఇరిగేషన్ భూమి ఆక్రమిస్తుంటే సిబ్బంది లేరంటూ పాట
- ○జెసి నివేదిక సిద్ధం
- ○కలెక్టర్ నిర్ణయంపై ప్రజల్లో ఉత్కంఠ



అల్లీపురంలో రియల్ ఎస్టేట్ నిర్మాణాలు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు నుడా పరిధిలోనూ పెద్ద ఎత్తున అక్రమ లేవుట్లు సాగుతున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతోంది. నుడా పరిధిలో 118 అక్రమ లేవుట్లు ఉన్నట్లు ఆశాఖ అధికారులు ఎప్పుడో గుర్తించారు. కార్పొరేషన్, నుడా, అనుమతులేకుండా, ఓ వేళ ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా ఇవి సాగుతున్నాయి. 40 అడుగులు ఉండాల్సిన రోడ్డు 30 నుంచి 20 అడుగులకు కుదించారు. సామాజిక అవసరాలు ఉండాల్సిన భూమిని కొందరు వదలడం లేదు. ఇవి అక్రమ లేవుట్లు అని తెలిసినా రిజిస్ట్రేషన్లు ఆగడం లేదు. వీటిని నిలుపుదల చేయడానికి ఎలాంటి చట్టాలూ లేవని తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలు సాగిపోతు న్నాయి. మధ్య తరగతి ప్రజలు సొంతింటి కల కోసం అప్పులు చేసి భూములు కొనుగోలు చేస్తున్నారు. జరుగుతోన్న పరిణామాలు వారిని ఆందోళన కలిగిస్తున్నాయి. అల్లీపురం గ్రామంలో ఏకంగా ప్రభుత్వ భూమినే ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారు. గతంలో ఈ విషయం కలెక్టర్ చక్రధర్‌బాబు దృష్టికి టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీసుకెళ్లారు. ఆయన విచారణ జరిపించారు. ఈ క్రమంలో మొత్తం లే అవుట్‌లో 6.30 ఎకరాలు ఇరిగేషన్ భూములను ప్లాట్లుగా మార్చేశారని నివేదిక ఇచ్చారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, కార్పొరేషన్, నుడా అధికారులను, ఇరిగేషన్ భూముల స్వాధీనం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వైసిపి నేతల బెదిరింపులకు భయపడినట్లు ప్రచారం సాగుతోంది. ఇరిగేషన్ కాలువలను పూడ్చేసి, ప్లాట్స్ చేశారని తెలిసినా ఆ శాఖ అధికారులు చర్యలకు ముందుకు వెళ్లడం లేదు. తమకు ఒక్క ఎఇ మాత్రమే ఉన్నారని, అక్కడకు వెళితే తమను బెదిరిస్తున్నారని, తమకు ఎవరు రక్షణ ఇస్తారంటూ ఇరిగేషన్ అధికారులు చేతులు దులుపు కుంటున్నారు. కలెక్టర్ ఉత్తర్వులు అమలు కాకపో వడంతో అల్లీపురానికి చెందిన రైతులతోపాటు, సోమిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఇరిగేషన్ భూములు స్వాధీనం చేసుకోవాలని, అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేసింది. అటు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు అమలు జరగడం లేదు. హైకోర్టు లేదు,. కలెక్టర్ లేదంటూ రెచ్చిపోతున్నారు. తమకు నేతల అండదండ ఉన్నాయని చెలరేగిపోతున్నారు. అల్లీపురంలో ఇరిగేషన్ వివాదస్పద స్థలంలో యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఏ ఒక్క అధికారి నిలుపుదల చేయడానికి ముందుకు వెళ్లడం లేదు. కొందరు తాము అక్కడకు వెళ్లాలంటే భయమేస్తుందంటూ చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ వ్యవహారం ఇరిగేషన్ అధికారుల తీరుపట్ల ఉన్నతా ధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

జెసి నివేదిక సిద్ధం..!

అల్లీపురంలో తాజా పరిస్థితులపై హైకోర్టు ఉత్తర్వులు, కలెక్టర్ ఆదేశాల అమలు, వాస్తవ పరిస్థితుల తెలపాలని కలెక్టర్ హరినారాయణ జెసి కూర్మానాథ్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అన్ని రికార్డులు పరిశీలించిన ఆయన తన నివేదిక సిద్ధం చేసినట్లు తెలిసింది. అది ఇరిగేషన్ భూమేనని, అక్రమ కట్టడాల నిర్మాణాలు సాగుతున్నట్లు గుర్తించినట్లు సమాచారం. విచారణ చేసిన జెసి తన వివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నారు. ఈ విషయంలో కలెక్టర్ ఏలాంటి నిర్ణయం తీసుకుంటారు. ఏం జరుగుతుందోననే ఆసక్తి అందరిలో నెలకొంది. ఏం జరుగుతుందో చూడాలి.



సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్

సచివాలయంలో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు

నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 39/1 మెక్లిన్స్ రోడ్, 39/3 అరిగల వారి వీధి వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శనివారం తనిఖీ చేశారు. సచివాలయాలలోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. పెండింగులో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. ఎస్.డి.జి సర్వే, భూహక్కు సర్వే, ఎ.పి సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలని తెలిపారు. అదేవిధంగా ఆస్థి పన్ను, యూజర్ చార్జీల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని, తమకు నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోపు అందుకోవాలని సూచించారు.కార్యక్రమంలో నగర పాలక సంస్థ వివిధ విభాగాల కార్యదర్శులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై సమీక్ష

ప్రజాశక్తి -నెల్లూరు : నాబార్డ్ ద్వారా జిల్లాకు మంజూరై వివిధ దశల్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం హరి నారాయణన్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో నాబార్డు ద్వారా మంజూరైన జిల్లాలో అమల వుతున్న గ్రామీణ మౌలిక వసతుల అభివద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహిం చారు కలెక్టర్ మాట్లా డుతూ వివిధ శాఖలకు సంబంధించి పురో గతిలో ఉన్న పనులపై ఆరా తీశారు. జిల్లాకు మంజూరైన 374 ప్రాజెక్టులకు గాను 80 ప్రాజెక్టులు పూర్తయి నట్లుగా గుర్తించామన్నారు. నాబార్డ్ డిడి ఎంఎం రవిసింగ్, డుమా పిడి వెంకట్రావు, ఫిషరీస్ జెడి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జెడి మహేశ్వరుడు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్

'జల్ జీవన్ మిషన్' పనులు పూర్తి

ప్రజాశక్తి-నెల్లూరు :గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన జల్ జీవన్ మిషన్ కింద పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఎం హరి నారాయణన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జల్‌జీవన్ మిషన్, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి సరఫరా పనులపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ రంగ వరప్రసాద్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం కింద మంజూరైన ఐదు లక్షల లోపు పనులను త్వరగా మొదలుపెట్టి పూర్తిచేయాలన్నారు. రెండు వారాల్లోగా ఐదు లక్షల పైబడిన పనులకు టెండర్లు పూర్తి చేసి వర్క్ ఆర్డర్లు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి కూడా కుళాయి కనెక్షన్లు ఇవ్వడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా కూడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని అందించాలని, పైపులైన్లు వేసి నీటిని సరఫరా చేసే వీలున్నచోట త్వరితగతిన పైపులైన్లు వేసి నీటిని సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

'మొబైల్ హంట్' సేవలు ఉపయోగం : ఎస్పి

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా వాసులకు 'మొబైల్ హంట్ ' సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఎస్పి కె తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. తమ సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయంటూ ఇప్పటి వరకూ 3054 ఫిర్యాదులు చేయగా 2429 ఫిర్యాదులను నమోదు చేసి ఇప్పటి వరకు 405 సెల్‌ఫోన్లు బాధితులకు అందజేశామని ఆయన తెలిపారు. శనివారం ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.50 లక్షల విలువ చేసే 212 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో మొబైల్ ఉపయోగించడం అనేది నిత్యజీవితంలో ఓ భాగమైందన్నారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో సరైన బిల్లులు లేని కొత్త/సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు ఎవరూ కొనవద్దని సూచించారు. జిల్లా పోలీసు శాఖలో ఇటీవల ప్రవేశపెట్టిన "మొబైల్ హంట్" సేవలను ఒక్క మెసేజ్ తో స్పందించి రికవరీ ప్రారంభిం చామన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు ముందుగా మొబైల్ నంబర్: 9154305600 కు వాట్సాప్ ద్వారా ఒక మెసేజ్ ను పంపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు శాఖ ఉన్నతా ధికారులు పాల్గొన్నారు.



విద్యా శాఖ నిబంధనలు అమలు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు :ఈ ఏడాది విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యాశాఖ నిబంధనల పక్కాగా అమలు చేయాలని, అందులో భాగంగా ప్రయివేటు పాఠశాలలో ఫీజుల నియంత్రణ కు చర్యలు తీసుకోవాలని, తక్షణమే ప్రభుత్వం ప్రకటించిన ఫీజులను అమలు చేయాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం ఈ కమిటీ సభ్యులు జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ది పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శిఖరం నరహరి మాట్లాడారు. ది పేరెంట్స్ అసోసియేషన్ కోశాధికారి దాసరి కమలాకర్ ఉపాధ్యక్షులు సిహెచ్.మహేష్ కుమార్ ,కోటా శ్రీనివాసులు రెడ్డి, నూకరాజు మాల్యాద్రి ,కే శ్రీనివాసరావు ఉన్నారు.



ఈదురు గాలుల దెబ్బకు నేలకొరిగిన చెట్లు

నేలకొరిగిన చెట్లు

ప్రజాశక్తి- గుడ్లూరు :మండలంలో శనివారం గాలి వర్షం దాటికి పొట్లూరు దగ్గర నుంచి తెట్టు జాతీయ రహదారి వరకు గల ప్రధాన రహదారిపై చెట్లు విరిగి పడ్డాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో కొందరు ప్రయాణికులు స్పందించి రోడ్లపై విరిగిపడ్డ చెట్లను తొలగించారు. అనంతరం ట్రాఫిక్ యథావిధిగా సాగింది. అకాల వర్షం కారణంగా ఆ ప్రాంతంలో పలు తోటల్లో మామిడి కాయలు రాలిపోయాయి.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -కందుకూరు : ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇల్లు నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గహ నిర్మాణ శాఖ పిడి పి నరసింహులు గహ నిర్మాణ శాఖ అధికారులకు, సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. పేదలందరికీ ఇల్లు పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాల కేటాయించడమే కాకుండా ఇల్లు నిర్మించు కునేందుకు లబ్ధిదారులకు రూ. 1,80,000 మెప్మా ద్వారా రుణం రూపంలో మరో రూ. 35 వేలు అందిస్తుందని వెల్లడించారు. లబ్ధిదారులకు ప్రభుత్వ అందిస్తున్న ప్రయోజనాలను వివరించాలని సచివాలయం సిబ్బంది, గహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు మహదేవపురం జగనన్న లేఔట్ ను ఆయన సందర్శించారు. కొండముడుసు పాలెంలోని సచివాలయంను సందర్శించి రిజిస్టర్లు మెయింటైన్ చేయాలని సూచించారు. గహ నిర్మాణ శాఖ ఈఈ పివిఎస్ శర్మ, గహనిర్మాణ శాఖ కందుకూరు ఎఇ సిహెచ్ శ్రీనివాసులు, సచి వాలయం వార్డ్ ఎమినిటీస్ పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -కందుకూరు : సమ్మర్ వెకేషన్ సందర్భంగా పందలపాడు గ్రామంలో జాషువా యూత్ అధ్వర్యంలో జరిగిన పిపిఎల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్న మెంట్‌లో కందుకూరు ఫ్రెండ్స్ క్రికెట్ లెవన్ జట్టు విన్నర్‌గా పందలపాడు జాషువా లెవన్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. విన్నర్‌గా నిలిచిన జట్టు కెప్టెన్ సుధాకర్‌కు మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు వర్ల దేవదాసు కప్‌తో పాటు రూ.20000లు అందించారు. రన్నర్‌గా నిలిచిన జాషువా లెవన్ జట్టు కెప్టెన్ గోచిపాతల బద్రికి జాషువా యూత్ సభ్యులు వర్ల వసంతరావు కప్‌తో పాటు రూ. 10000లు అందిం చారు. మాన్‌ఆఫ్‌ద సిరీస్ అభిలాషకు హైకోర్టు అడ్వకేట్ చేవూరి శామ్ కప్ అందిం చారు. దేవ దాసు మాట్లాడుతూ పల్లె టూరిలో ఇంత అద్భుతంగా టోర్నమెంట్ నిర్వహించిన జాషువా యూత్ సభ్యులు వర్ల రాజేష్ వర్ల కోటయ్య వర్ల కిషోర్ వర్ల రాజా మరియు సహ కరించిన యూత్ సభ్యులు అందరికి పేరు పేరు న ధన్యవాదాలు తెలిపారు.



పారిశుధ్య నిర్వహణకు చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు

నగర, రూరల్ ప్రాంతాల్లో అపార్టుమెంట్స్ వాసులు పెద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి కార్పొరేషన్ సిబ్బంది తడి, పొడి చెత్త సేకరణకు పూర్తి స్థాయిలో సహకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ పిలుపు నిచ్చారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక ఫతేఖాన్ పేట, రైతు బజార్, టెక్కెమిట్ట, మాగుంట లే అవుట్, లెక్చరర్స్ కాలనీ, క్రాంతి నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమిషనర్ శనివారం పర్యవేక్షించారు. కార్పొరేషన్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ డ్రెయిన్ కాలువల్లో క్రమం తప్పకుండా పూడికతీత పనులను చేపట్టాలని, సిల్టు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. అనంతరం సరస్వతి నగర్ లోని అపార్ట్మెంట్ వాసులతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ అపార్ట్మెంట్ లోని అన్ని ఫ్లాట్ల యజమానులు తడి, పొడి చెత్త సేకరణకు విధిగా పెద్ద డస్ట్ బిన్ లను ఉంచాలన్నారు. పెద్ద డస్ట్ బిన్ లను అపార్ట్మెంట్ వాసులంతా వినియోగించేలా అవగాహన కల్పించి అపార్ట్మెంట్ ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను విడివిడిగా చెత్త సేకరణ వాహనాలకు అందించాలని, చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే గహ వ్యర్థాలను అందించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తామని, చెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చి తిరిగి వినియోగంలోకి తీసుకురాగలమని కమిషనర్ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ శానిటేషన్ సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన అభివద్ధి పనులకు ప్రాధాన్యతచ్చి వేగంగా పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఎం హరి నారాయణన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో గడపగడపకు మన ప్రభుత్వం అభివద్ధి పనుల పురోగతిపై ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యటించి ప్రజల కోరిక మేరకు మంజూరు చేసిన అభివద్ధి పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సచివాలయం వారీగా అభివద్ధి పనులకు ప్రభుత్వం రూ 20 లక్షలు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ నిధులతో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం ప్రధాన ఉద్దేశం అన్నారు. అధికారులందరూ కూడా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన అన్ని అభివద్ధి పనులను ఆగస్టులోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. మంజూరైన పనులను మొదలుపెట్టడం, పూర్తయిన పనులకు బిల్లులు అప్లోడ్ చేయడం, బిల్లులు మంజూరు చేయడం వంటి వివిధ దశలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ ఎస్ ఈలు అశోక్ కుమార్, రంగవర ప్రసాద్, సంపత్ కుమార్, మదరస అలీ, సిపివో సాలెంరాజు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

'మాలకొండ' ఆదాయం రూ. 12 లక్షలు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ అధికంగానే ఉంది. వేసవి సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు. ప్రత్యేక దర్శనం 4083 మంది దర్శించుకోగా, రూ. 4,08,300 ఆదాయం సమకూరింది. అన్న దానంకు రూ. 4,27,380 విరా ళాలు వచ్చాయి. ఇంకా విరా ళాలు, అష్టోత్తరం పూజలు, వివాహాలు, తలనీలాలు, వాహన పూజలు తదితర మార్గాల్లో మొత్తంగా రూ. 12,50,520 లక్షలు వచ్చినట్లు ఆలయ సహాయ కమి షనర్ కెబి శ్రీనివాసరావు తెలిపారు. ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి స్వామివారిని దర్శిం చుకున్నారు. ఆలయ పరిసరాల్లో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.



'మాలకొండ'లోఎంఎల్ఎ



వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

వలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని పోకూరు, శాఖవరం గ్రామ సచివాలయాల పరిధిలోని వాలంటీర్లకు సన్మానం శనివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మండల వ్యవసాయాధికారి ఎం హేమంత్ భరత్‌కుమార్, ఎంపిడిఒ షేక్ రఫీక్‌అహ్మద్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వాలంటీర్లకు గౌరవ వేతనం అందిస్తుందన్నారు. అంతకు మించి ప్రజలకు సేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాలని చెప్పారు. సర్పంచులు పర్రె కనకరత్నం, గడ్డం భవాని, వివిపాలెం పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి రమేష్‌బాబు, ఎంపిటిసి వడ్లమూడి జయమ్మ, వైసిపి నాయకులు అత్తోట చెన్నయ్య, పర్రె జగదీష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



అగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్యవసర సేవలపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా విఆర్‌సి సెంటర్‌లో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యులచే ప్రజలకు అత్యవసర సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసు కోవడం పై అవగాహన నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ అవ గాహన కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా ట్రాఫిక్ డిఎస్‌పి అబ్దుల్ సుభాన్ , మెడికవర్ హాస్పిటల్స్ ఎమర్జెన్సీ విభాగం అధిపతి డాక్టర్ కష్ణ చైతన్య , డాక్టర్ బిందు శ్వేత , డాక్టర్ సాహిత్యరెడ్డి, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.ముఖ్యఅతిథిగా హాజరైన అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ భద్రత అనేది ప్రతి వ్యక్తితో మొదలయ్యే సమిష్టి బాధ్యతన్నారు.అనంతరం డాక్టర్ కష్ణ చైతన్య మాట్లాడారు. వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర రెడ్డి, సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ నాగిరెడ్డి, రీజినల్ మార్కెటింగ్ హెడ్ ఉదయ్ భాస్కర్, సురా భాస్కర్ రెడ్డి ఉన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని వరిగొండ దేవళ్లాలమిట్ట ప్రాంతంలో ఉన్న శ్రీ జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తాతా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వేడుకల వివరాలను వెల్లడించారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సహాయ సహకారాలతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసారావు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోసూరు రవీంద్రయ్య పర్యవేక్షణలో వేడుకలు జరుగుతాయాన్నారు.



కలెక్టర్ సమీక్షకు హాజరైన అధికారులు

ఎఆర్‌టి సెంటర్లలో తనిఖీ చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో నూతనంగా ఏర్పాటయ్యే ఏ ఆర్ టి, సరోగసి కేంద్రాలలో సమిష్టిగా తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ ఆదేశించారు.శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ హరి నారాయణన్ అధ్యక్షతన జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రి యేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిసి, పిఎన్ డిటి, ఎఆర్‌టి, సరోగసి చట్టాలను జిల్లాలో సక్రమంగా అమలు చేయాలన్నారు. సభ్యులు డాక్టర్ గీతా లక్ష్మి, ఎన్ జి ఓ కవితా రెడ్డి, లీగల్ కన్సల్టెంట్ రూప, డి.ఎస్.పి శివాజీ రాజు పాల్గొన్నారు.


జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి

పజాశక్తి-ఆత్మకూర్ అర్బన్

ఎఐసిసి పిలుపుమేరకు ఆత్మకూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చేవూరు శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో నెల్లూరు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నం నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఆత్మకూరు పట్టణంలోని రాజీవ్ భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత దేశ స్వాతంత్ర్య సమరయోధుడు భారత దేశ మొట్టమొదటి ప్రధానమంత్రి భారతరత్న పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా రామానుయుని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ భారతదేశానికి దశ దిశా చూపించి భావితరాల భవిష్యత్తుకి బలమైన పునాదులు వేసి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.మస్తానయ్య, సిహెచ్ అనిల్, ఎస్‌డి రసూల్, ఎ.వేణు, కె.సతీష్, ఏ.కుమార్ పాల్గొన్నారు.

అధిక కరెంటు లోడుతో సమస్యలు

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఆఫీసు వెనక ఉన్న ట్రాన్స్‌ఫారంలో ఒక లైన్లో అధిక ఓల్టేజ్ రావడంతో శనివారం విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయని గ్రామస్తులు తెలిపారు. లో వోల్టేజ్ కారణంగా బోగోలు, విశ్వనాథరావుపేటలో ఎసిలు పనిచేయడం లేదని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫారం కెపాసిటీ పెంచి విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


కూలింగ్ మిషన్‌ను అందజేస్తున్న దృశ్యం

కూలింగ్ మిషన్ బహూకరణ

ప్రజాశక్తి-ఉదయగిరి

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీపథకం కార్యాలయ సిబ్బందికి గ్రామ ప్రజలకు దాహార్తి తీర్చడానికి ఎంపిపి మూలే పద్మజ వినయ్ రెడ్డి కూలింగ్ వాటర్ మిషన్ బహూకరించారు. శనివారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో కూలి వాటర్ మిషన్‌ను ఎపిఒ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సౌకర్యార్థంకు వేసవిని దృష్టిలో ఉంచుకొని కార్యాలయానికి వచ్చే సిబ్బంది దాహార్తి తీర్చేచేందుకు ఈ వాటర్ మిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పద్మజా వినయ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గురవయ్య, ప్రసన్న, ఉపాధి హామీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-సంగం

సంగంలోని తిరమనతిప్ప వద్ద ఉన్న జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ పీడీ నరసింహారావు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల నాణ్యతను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యత లేకుండా కట్టిన బేస్మెంట్‌లను దగ్గరుండి తొలగించారు. నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు జరపాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. లబ్ధిదారులు తమ ఇళ్లను నిత్యం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏ ఈ కరీముల్లా,సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటేశ్వర కాలేజీకి అవార్డు

ప్రజాశక్తి-కొడవలూరు

మండలంలోని నార్తురాజుపాలెం వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు ప్రముఖ భారతీయ సంస్థ అసోచామ్(అసోసియేటెడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫర్ ఇండియా) అవార్డు దక్కింది. అసోచామ్ నేషనల్ కౌన్సిలర్ ఎడ్యుకేషన్ విభాగం ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన 16వ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ లీడర్ ఫిష్ స్కిల్ డెవలప్మెంట్ సదస్సులో ఇనిస్ట్యూట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును బహూకరించింది. యువత విద్య వికాసం ఉద్యోగ కల్పన స్కిల్ డెవలప్మెంట్ తదితర రంగాలలో గత 12 సంవత్సరాలుగా జిల్లాలో అగ్ర గ్రామిగా ఉన్నందున కళాశాలకు ఈ అవార్డును బహూకరించారు. కేంద్ర కున్వర్ శేఖర్ విజేంద్ర సహాయ చైర్మన్ రజిత కులకర్ణీల అవార్డు అందజేశారు. వెంకటేశ్వర కళాశాల ప్రిన్సిపల్ పి.కుమార్ బాబు, డైరెక్టర్ పి. కష్ణ చైతన్యలు అవార్డును అందుకున్నారు. ప్రపంచంలోని వెయ్యి యూనివర్శిటీల ప్రతినిధులను ఆహ్వానించి ఉన్నత స్థాయిలో నిర్వహించిన సదస్సులో అత్యున్నత అసోచామ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు తమ కళాశాలకు దక్కడం ఎంతో ఆనందానిచ్చిందని కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబు నాయుడు అభిప్రాయపడ్డారు. కళాశాల ప్రతిష్టను మరింత పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

అల్లూరు చెరువులో దర్జాగా వరినాట్లు

- 145 సెక్షన్‌కి తూట్లు

- నిర్లక్ష్యంగా ఇరిగేషన్ శాఖ


చెరువు భూముల్లో నాట్లు వేసిన దృశ్యం


145 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ ఇంజన్ ఏర్పాటు చేసివున్న దృశ్యం

ప్రజాశక్తి-అల్లూరు

అల్లూరు చెరువులో పెద్ద మనుషులు కొందరు భూములు కబ్జా చేసి వరినాట్లు వేసి దర్జాగా సాగు చేస్తూ ఉంటే ఇరిగేషన్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. ఆక్రమణల గురించి అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోందని అధికారుల తీరుపై కొందరు బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. 145 సెక్షన్‌కి అధికారులే తూట్లు పొడుస్తున్నారని భారీ స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఈ సెక్షన్ అమల్లో ఉంటే పనులు చేసే యంత్రాలను పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేయాలని తెలియజేస్తున్నారు. కాగా పట్టపగలే యంత్రాలతో చదును చేసి చుట్టూరు స్తంభాలు నాటి ఇనుప ముళ్లకంచతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వరినాట్లు వేస్తుంటే ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ శాఖ అధికారులపై ప్రజానీకం మండిపడుతున్నారు. ఇంజన్ ఏర్పాటు చేసి పైపులైన్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తూ చెరువు భూములకు ఎసరు పెడుతుంటే అధికారులు నిద్రావస్థలో ఉండడం సిగ్గుచేటన్నారు. నిబంధనలను అతిక్రమించిన భూ కబ్జాదాలను ప్రశ్నించలేని స్థితిలో ఇరిగేషన్ శాఖ ఉందని చలోక్తులు విసురుతున్నారు. ఆ శాఖకు సంబంధించిన కొంతమంది చేతివాటానికి పాల్పడి ఆక్రమణదారులకు సహకరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కంచే చేను మేసిందనే చందాగా చెరువు భూములకు రక్షణ కల్పించాల్సిన అధికారులే ఇలా వ్యవహరించడం విడ్డూరంగా ఉందని పేర్కొంటున్నారు. ఇటీవల కొందరు వైసిపి నాయకులు పట్టపగలే జెసిబిలు, ట్రాక్టర్లతో ఇష్టాను రీతిలో మట్టిని తరలించి సొమ్ము చేసుకున్నారు. అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి పట్టపగలే అంతా దోచుకున్నారు. కాగితాలకే పరిమితమైన సెక్షన్లు ఎందుకని రాజ్యాంగాన్ని అమలు పరచలేని దుస్థితిలో మన అధికారుల పనితీరు చాలా బాధాకరమన్నారు. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి అక్రమార్కుల భరతం పట్టాలని కోరుతున్నారు. సంబంధిత విషయంపై ఇరిగేషన్ ఏఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

తహశీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. అల్లూరు చెరువుపై 145 సెక్షన్ అమల్లో ఉందని ఇప్పటికే స్థానిక ఎస్ఐ, ఎస్‌పి, కలెక్టర్, ఇరిగేషన్ డిఇ, ఇ.ఇ.లకు సమాచారం ఇచ్చామన్నారు. ప్రధానంగా ఈ సమస్యను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవాల్సి ఉందని తెలియజేశారు. అంతేకాకుండా యంత్రాలతో విచ్చలవిడిగా మట్టిని తీసుకు వెళ్తున్నట్లు సమాచారం అందిందని ఇకపై గట్టి చర్యలు చేపడతామని ఆయన తెలియజేశారు. అలాగే ఆక్రమణలు జరగకుండా వరినాట్లు వేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డిని వివరణ కోరగా చెరువుపై 145 సెక్షన్ అమల్లో ఉందన్నారు. తహశీల్దార్ ఆదేశాలు జారీ చేశారని చెరువును పరిశీలించి తగు చర్యలు చేపడుతామని హామీనిచ్చారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎపిఒ శ్రీనివాసరావు

'ఉపాధి' కూలీలకు సూచనలు

ప్రజాశక్తి-ఉదయగిరి

మహాత్మా గాంధీ ఉపాధి కూలీలకు సిబ్బందికి ఎపిఒ శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. శనివారం మండల పరిధిలోని శకునాలపల్లి, పుల్లాయపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి కూలీలకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు చేసే ప్రదేశాలలో పనులకు తగ్గట్టు పొడవు వెడల్పులను గుర్తుంచుకొని వేతనం రూ.272 రోజు కూలి పడేలా పనులు కూలీలు చేసుకోవాలన్నారు. సిబ్బంది ప్రభుత్వం కల్పించిన టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మంచీ నీరు పనులు జరిగే ప్రదేశాలలో తప్పనిసరిగా ఉంచాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. కూలీలు వేసవి దృష్టి ఉదయం 6 నుండి 10 గంటలలోగా పనులు పూర్తి చేసుకునేలా ఉండాలని కూలీలకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది కూలీలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

ప్రజాశక్తి-వరికుంటపాడు



మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న విద్యుత్ స్తంభంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యార్థులు భోజనం చేసే ప్రదేశం ప్రధానోపాధ్యాయుని గది వెనుక వైపు ఉన్న విద్యుత్ స్తంభం నుంచి వివిధ గృహాలకు సంబంధించిన విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయన్నారు. సమస్య పరిష్కరించాలని విద్యుత్ శాఖకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

వినతిపత్రంను పరిశీలించాను. రెండు మూడు రోజుల్లో ఆ స్తంభాన్ని తొలగించి వేస్తాను. ఖుద్దూస్ బాషా, ఏ.ఈ.



గ్రామసింహాలతో బెంబేలు..

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలం పరిధిలోని కనియంపాడు, జాతీయ రహదారి, పలు గ్రామాలలో గ్రామసింహాలు ద్విచక్ర వాహనదారులపై వెంట పడడంతో భయంతో కిందపడి గాయాల పాలవుతున్నారు. కాబట్టి పంచాయతీ పాలకవర్గం లేకపోతే సంబంధిత అధికారులు గ్రామసింహాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

రాష్ట్రపతికి అవమానం

ప్రజాశక్తి-కావలి

అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశానికి ప్రథమ పౌరురాలైన ఆదివాసీ మహిళా రాష్ట్రపతితో నూతన పార్లమెంటు ప్రారంభోత్సవం చేయించకుండా బిజెపి ప్రభుత్వం అవమానిస్తుందని మహిళా నేత చాకలకొండ శారద ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాస్తవానికి రాజ్యాంగం ప్రకారం ప్రథమ ప్రాతినిధ్యం ఇవ్వాలని, కానీ మతతత్వ బిజెపి దేశమౌలిక నిబంధనలను తోసిపుచ్చి, 'న.మో.' కీర్తిని బిజెపి ఆధిపత్యాన్ని ప్రకటించుకోవడం కోసం, దేశంలోని హిందూత్వవాదులను ప్రభావితం చేసేందుకు ప్రధాని మోడీ రాష్ట్రపతిని కించపరచడం సరికాదని ఖండించారు. 2024 ఎన్నికలలో ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రితో పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాజ్యాంగాన్ని, గిరిజన మహిళను కించ పరుస్తున్నారని విమర్శించారు. 'రాజదండం' ప్రథమప్రధానికి చోళరాజులు ఇచ్చిన వ్యక్తిగత బహుమతని, మనువాద సంస్కృతిని మళ్లీ తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి, దాని నియంతృత్వ పోకడలకు ప్రతీకగా పార్లమెంటులో స్పీకర్ స్థానానికి సమీపంలో ఉంచేందుకు చేస్తున్న పోకడ ప్రజాస్వామ్యాన్ని కించ పరచి నట్లే అని వ్యాఖ్యానించారు. ప్రజాతంత్రవాదులు రాజ్యాంగ పరిరక్షవాదులు ఈ నిరంకుశ నిర్ణయాలను ఖండించాలని పిలుపు నిచ్చారు.


వలంటీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ముగిసిన సన్మాన కార్యక్రమాలు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలో ప్రారంభమైన వలంటీర్లకు వందనం కార్యక్రమం శనివారంతో ముగిశాయి. చెరువు పల్లి సచివాలయ పరిధిలో సర్పంచులు గీత, తిరుపతమ్మ, నేలటూరు సచివాలయంలో సర్పంచ్ పద్మ ఉప సర్పంచ్ ద్వారపనేని చెన్నయ్య అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నవరత్నాలు సచివాలయం ద్వారా వాలంటరీలు అందించడం అభినందనీయమన్నారు. వేకువజామునే ప్రతి గడపకు పెన్షన్ సంక్షేమ పథకాలను అందిస్తున్న వాలంటరీలకు ఈ సన్మాన కార్యక్రమం చేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఖాధర్ కరిముల్లా, ఆంజనేయులు, ఇత్తడి రమణయ్య, రాములు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తహశీల్దారు తనిఖీలు

ప్రజాశక్తి-బిట్రగుంట


రికార్డులు పరిశీలిస్తున్న తహశీల్దారు

బోగోలు మండలం జువ్వలదిన్నె, ఎస్‌పిపాలెం సచివాలయాల్లో శనివారం తహశీల్దార్ హేమంత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హునికి చేరేలా చూడాలని సిబ్బందికి సూచనలు చేశామని, విధుల్లో అలసత్వం వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

శతజయంతి విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-ఉదయగిరి



విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు చింతన బోయిన బయన్న పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు నియోజవర్గ ఇన్‌ఛార్జి బొలినేని వెంకట రామారావు ఆదేశాల మేరకు సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అని నినాదం చెప్పిన వ్యక్తి తెలుగు రాష్ట్రాల ఆశా కిరణం, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నందమూరి తారక రామారావు 100వ జన్మదినం ఆదివారం ఉదయం 10.00 గంటలకు ఉదయగిరిలో బస్టాండ్ సెంటర్ వద్ద 100 కేజీల భారీ కేక్ కటింగ్ తో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అనాథ ఆశ్రమంలో పిల్లలకు భోజనం పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్ఏ కంభం విజయరామ్ రెడ్డి మాజీ జెడ్‌పి చైర్మన్ చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు, పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వరికుంటపాడు

కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం వరికుంటపాడు బస్టాండ్ సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద చోటు చేసుకుంది. వివరాల మేరకు... ప్రకాశం జిల్లా సిఎస్‌పురం మండలం కోవిలంపాడు గ్రామానికి చెందిన షేక్ షంషీర్ (30) అనే వ్యక్తి కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం వీర బ్రహ్మేంద్ర ఆలయం వద్ద రోడ్డు పక్కన బైక్‌ను ఆపి కస్టమర్లకు ఫోన్ కాల్ చేస్తుండగా, వేగంతో వచ్చిన కారు అతనిని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటీన అక్కడ ఉన్న గ్రామస్తులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య కోసం పామూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ శ్రీనివాస్ తెలిపారు.


దెబ్బతిన్న కారు ముందుభాగం

బైక్‌ను ఢీ కొన్న కారు


ప్రజాశక్తి మర్రిపాడు

మండలంలోని నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం సమీపంలో బైక్ ను కారు ఢీకొన్న ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. మర్రిపాడుకు చెందిన చంద్ర రాజశేఖర్ శనివారం ఉదయం బైక్‌పై పొలానికి వెళ్తుండగా నెల్లూరు నుండి మహబూబ్ నగర్ వెళ్తున్న కారు బైక్‌ను వెనుకవైపు నుండి ఢీకొట్టడంతో పల్టీలు కొట్టి ముళ్ల పొదల్లో పడి పోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే స్వల్ప గాయలతో ఉన్న క్ష తగాత్రున్ని ముందుగా ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ విశ్వనాధ్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహానాడు స్టేజీపై 'కాకర్ల సురేష్'

ప్రజాశక్తి-వరికుంటపాడు

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా రాజమహేంద్రవరంలోని మహానాడులో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ సందడి చేశారు. రెండు రోజులు జరిగే మహానాడు స్టేజి పైన కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్‌కు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం చుట్టుపక్కల భారీగా ఫ్లెక్సీలు కటౌట్లతో మహానాడులో కాక పుట్టిస్తున్నాడు. ఉదయగిరి నియోజకవర్గ ప్రాంతం అభివృద్ధి కోసం ప్రతినిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తూ ముందుకు సాగుతున్న కాకర్ల సురేష్ మహానాడు స్టేజీపై కనపడటంతో నియోజకవర్గ ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మహానాడు చుట్టూ 40 భారీ ఫ్లెక్సీలు సుమారుగా 50హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి ఎవరి కాకర్ల సురేష్ ఏ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి అని మహానాడులో చర్చగా కటౌట్లను ఏర్పాటు చేశారు. మహానాడు స్టేజీపైకి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కాకర్ల సురేష్‌కు స్వాగతం పలికారు.





ఆర్‌డిఒ తీరు సరికాదు

ప్రజాశక్తి-కావలి

కావలి మున్సిపాలిటీని ప్రక్షాళన చేస్తానన్న ఆర్‌డిఒ శీనానాయక్ అవినీతికి మారుపేరైన మున్సిపల్ కమిషనర్ శివారెడ్డిని మళ్లీ ఎలా తెచ్చారని జనసేన నాయకులు సిద్ధు ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నాయకులు తోట వెంకటశేషయ్య, రూరల్ మండల అధ్యక్షుడు తిరపతి స్వామి, బోగోలు మండల నాయకులు చంటి, విద్యార్థి నాయకులు విజయ్, తోట సాయి, విజయ్ సాజిద్, మోహిద్, వాహిద్, సయ్యద్ పాల్గొన్నారు.



మహానాడుకు తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-మర్రిపాడు

టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంటూరు మురళి కన్నబాబు ఆదేశానుసారం రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో జరుగుతున్న టిడిపి మహానాడు కార్యక్రమానికి పార్టీ మండలాధ్యక్షులు అరికట్ల జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో శనివారం మండల టిడిపి శ్రేణులు తరలి వెళ్లారు. మహానాడుకు తరలివెళ్లిన వారిలో యలగాలవెం కటేశ్వర్లు, మధుసూదనరెడ్డి, కర్యావులు శ్రీనివాసులు, మూడుపూరు చంద్రబాబు, శాకాపురం సురేష్ బోయపాటి సుబ్బారాయుడు, కార్యకర్తలు అధిక సంఖ్యలో బయలు దేరి వెళ్లారు.

జిల్లాలో గుప్పుమంటున్న 'గంజాయి'

వీక్షణం

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామంటూ పోలీసు శాఖ ఆర్భాటంగా పత్రికా ప్రకటనలు జారీ చేస్తుంది. పోలీసు శాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగం రెండు విభాగాలు సంయుక్తంగా దాడులు చేస్తున్నప్పటికీ జిల్లాలో యథేచ్ఛగా గంజాయి అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. అందుకు సాక్ష్యం ఇటీవల కాలంలో కావలి ప్రాంతంలో అక్రమంగా రవాణా చేస్తున్న 50 కేజీల గంజాయి, అందుకు వినియోగిస్తున్న రెండు కార్లను, ఆరు మంది సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన చోటు చేసుకొని వారం రోజులు సైతం పూర్తి కాకుండానే భారీ స్థాయిలో దొరవారిసత్రం మండల పరిధిలోని తల్లంపాడు గ్రామ సమీపంలో అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 250 కేజీల గంజాయి, ఇద్దరు ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమరవాణాకు తమిళనాడు ప్రాంతానికి చెందిన కొందరి వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. 30వ తేదీన జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు భారీ స్థాయిలో నిర్వహించేందుకు, దక్షణ భారత కమ్యూనిస్టు పోరాట యోధుడు జక్కా వెంకయ్య కమ్యూనిటి హాల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేసేందుకు పార్టీ శ్రేణులు పటిష్టంగా కృషి చేస్తున్నాయి. ఉపాధిహామీ చట్టం జిల్లాలో అమలు పరిశీలిస్తే భారీగా అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బహిర్గతం అవుతున్నాయి. ఉపాధి హామీ పనులు జరుగుతున్న ఇందుకూరు పేట ప్రాంతంలో ఏకంగా ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పనిచేస్తున్న పేర్లు నమోదు చేసి ఆ నిధులను స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలు, పాదయాత్రలు చేసే సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి కార్పొరేషన్ కార్మికులకు చేసిన హామీలను తక్షణమే అమలు చేయాలని, కార్పోరేషన్‌లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల ఉద్యోగాలకు భద్రత కల్పించాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎపి రైతుసంఘం నాయకులు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని కలిసి రైతులు పండించే పంటకు మద్దతు ధర అమలు చేసేందుకు అనుకూలంగా చట్టాలు రూపొందించాలని, రైతులు తమ సమస్యల పరిష్కారానికి చేస్తున్న పోరాటాలకు ప్రత్యేక్షంగా మద్దతు తెలియజేయాలని, పార్లమెంట్‌లో రైతుల పక్షాన కేంద్రాన్ని ప్రశ్నించాలని కోరుతూ రైతు సంఘాల నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.



గాలివాన బీభత్సం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని నందవరం రాంపల్లి, రామానాయుడుపల్లి, డిసిపల్లి, పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. నందవరంలో మంచినీటి కోసం ఏర్పాటుచేసిన ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం వాటర్ ప్లాంట్ ఈదురు గాలుల ధాటికి రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. మరొకచోట ఇండ్లపై ఇటుకతో కట్టిన పిట్టిగోడ విరిగి కింద పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పిలుచుకున్నారు. దీంతో కింద ఉన్న కొన్ని పరికరాలు ధ్వంసం అయ్యాయి. రాంపల్లిలో రేకుల షెడ్డుపై చెట్లు విరిగిపడడంతో రేకుల పైకప్పు ధ్వంసం కావడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో పలు ప్రాంతాల్లో గాలివాన ఉగ్రరూపానికి ప్రజలు కొద్దిసేపు భయంతో గడగడ లాడారు.